ప్రజాశక్తి

బుధవారం 18 జూన్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





నత్తనడకన ఖరీఫ్ సాగు

- ఆరంభంలోనే వర్షాభావం
- ముందుకు సాగని ఏరువాక



త్రోవగుంటలో జరిగిన ఏరువాక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, కలెక్టర్ (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జూన్ రాగానే ఖరీఫ్ సాగు మొదలుకానుంది. ఈ పాటికే వర్షాలు కురిస్తే ఈ నెలలో ముమ్మరంగా విత్తనాలు వేస్తుంటారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రభుత్వం నుంచి ఏరువాక కార్యక్రమాన్ని లాంఛనంగా చేపట్టారు. మరో వైపు పొగాకు కొనుగోళ్లు పూర్తవ్వలేదు. దీంతో రైతులూ ఇంకా సాగుపై దృష్టి సారించలేదు. అయితే జూన్ సగం దాటిపోయింది. వర్షాలు కురవలేదు. అరకొరగా కురుస్తున్నాయి. గత నెలలో అడపాదడపా కురిశాయి. వాతావరణం చల్లబడింది. ఎండల తీవ్రత లేదనుకున్నారు. జూన్ రాగానే ఎండలు తీవ్రమయ్యాయి. వేసవిలో మే నెలలోనే వాతావరణం బాగుందనే భావన జనంలో కలిగింది. జూన్‌లో వర్షాలు లేనందున ఖరీఫ్ సాగులో వేగం లేదు. రైతులు ఆశలన్నీ ఖరీఫ్‌పైనే పెట్టుకున్నారు. జూన్‌లో సాధారణ వర్షపాతం 57.9 మి.మీ.లు కురవాల్సి ఉంది. స్వల్పంగానే కురిసింది. 56 మి.మీ.ల లోటుగానే గుర్తించారు. వర్షాలకు కురిస్తే తప్ప సాగు ముందుకు సాగదు. ఖరీఫ్‌లో వివిధ పంటల సాధారణ విస్తీర్ణం 4,62,944 ఎకరాలు ఉంది. ఇప్పటివరకూ కేవలం 1687 ఎకరాల్లోనే సాగు జరిగింది. వర్షాలు పడితే విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. గతేడాది కూడా ఆరంభంలో వర్షాలు లేనందున అప్పట్లోనూ ఇదే పరిస్థితి. ఇదే సమయానికి గతేడాది 1446 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇక వ్యవసాయ శాఖ కూడా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు..

- నిలిచిపోయిన నగదు చెల్లింపులు
- జిల్లా రైతులకు రూ.25 కోట్ల మేర బాకీ పడ్డ ప్రభుత్వం



ధాన్యం నిల్వలు (ఫైల్)

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో రబీ ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. ఈ మేరకు జిల్లాలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం నుంచి మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ప్రభుత్వం మరో 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటుందన్న ఆశతో ఉన్న రైతులు డీలా పడ్డారు. జిల్లాలో ఏప్రిల్ నెల మొదటి వారం నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. ముందుగా 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. ఈ మేరకు మే నెల మొదటి వారం నాటికే లక్ష్యం మేర ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. బయట మార్కెట్లో ధాన్యం ధరలు తగ్గడం, అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు నష్టపోతున్నారని ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞప్తులతో పాటు, జిల్లాలో అత్యధికంగా వరిసాగు జరుగుతున్న నేపథ్యంలో ధాన్యం సేకరణ లక్ష్యం పెంచేలా అనుమతులు ఇచ్చారు. ఈ మేరకు రైతులకు మద్దతు ధర కల్పించడంలో భాగంగా మరో 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం గత నెల మూడో వారంలో ఆమోదం తెలిపింది. అప్పట్లో జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి తగిన ఆదేశాలిచ్చారు. రైతుల ఆశలకు అనుగుణంగా ధాన్యం సేకరణ జరపాలని ఆదేశించారు. అనుకున్నట్లుగా ధాన్యం సేకరణ జరిపితే జిల్లాలో మొత్తంగా 55 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగేది. కానీ మే నెల నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. రాష్ట్రప్రభుత్వం రెండో విడతగా మరో 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుమతి ఇచ్చినప్పటికీ అదనంగా 4,953 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనడం జరిగింది. మొత్తంగా రబీలో జిల్లాలో 34,953 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొన్నట్లయ్యింది. గతేడాది ప్రభుత్వం రబీలో రైతుల నుంచి 49 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నారు.

నిలిచిన నగదు చెల్లింపులు

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ళ విషయంలో త్వరితంగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసిన ప్రభుత్వం రబీ ధాన్యం కొనుగోళ్ల నగదు చెల్లింపుల్లో విఫల మయింది. జిల్లాలో రైతుల నుంచి సేకరించిన రబీ ధాన్యంకు గానూ రైతులకు రూ.81.07 కోట్ల నగదు చెల్లింపులు జరగాల్సి ఉండగా ఇప్పటివరకు రూ 56.30 కోట్లు చెల్లింపులు జరగ్గా ఇంకా రైతులకు రూ.25 కోట్ల మేర నగదు చెల్లింపులు ఇవ్వాల్సి ఉంది. మే నెల నుంచి రైతుల చెల్లింపులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో మరో 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటే రైతుల బకాయిలు ప్రభుత్వానికి తలనొప్పిగా మారే అవకాశం ఉన్న క్రమంలో ఆకస్మికంగా రబీ ధాన్యం కొనుగోళ్లు నిలిపివేసినట్లు భావిస్తున్నారు.



పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలో వామపక్ష నేతలు, కార్యకర్తలు

పాలస్తీనాపై యుద్ధం..

సామ్రాజ్యవాద విస్తరణ కోసమే..

- ప్రతి పౌరుడూ యుద్ధోన్మాదాన్ని ఖండించాలి..
- ఇజ్రాయిల్‌కు మోడీ మద్దతు ఉపసంహరించుకోవాలి
- పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలో వామపక్ష నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

గత 20 నెలలకు పైగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడి సామ్రాజ్యవాద విస్తరణ కోసమేనని, విదేశీ మార్కెట్ కోసం సామ్రాజ్యవాద దేశాలు సాగిస్తున్న విధ్వంసం వల్ల సుమారు 55 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు నిరసనగా, పాలస్తీనాకు సంఘీభావంగా వామపక్షాల ఆధ్వర్యంలో ప్రదర్శన చేపట్టారు. సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎం ఎల్), సిపిఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) తదితర పార్టీలు, పలు ప్రజాసంఘాలు కలెక్టరేట్ నుంచి చర్చి సెంటర్, మిరియాల పాలెం, పాత మార్కెట్ మీదుగా అద్దంకి బస్టాండ్ వరకు ప్రదర్శన సాగింది. అనంతరం అద్దంకి బస్టాండ్ వద్ద సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శివర్గ సభ్యులు జి.రమేష్, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడారు. తాను గెలిస్తే ఉక్రెయిన్, పాలస్తీనా యుద్ధాలను విరమింపజేస్తానని, యుద్ధ రహిత ప్రపంచ సాధనే తన లక్ష్యమని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ట్రంప్ యుద్ధోన్మాదాన్ని సృష్టిస్తున్నట్లు ఆరోపించారు. గాజాపై ఇజ్రాయల్ దాడుల్లో వేలాది మంది అమాయక ప్రజలు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రపంచంలో గొప్ప దేశంగా మారాలనే పేరిట అమెరికా సాగిస్తున్న యుద్ధ కాండపై ప్రతి పౌరుడూ స్పందించాలని కోరారు. ఇజ్రాయిల్ చర్యలపై ▶ 2లో

పరిపాలనపై

యోగాంధ్ర ప్రభావం

- విశాఖకు మోడీ వస్తున్నందున అదే పనిలో యంత్రాంగం
- జిల్లా నుంచి మండలాల వరకూ అధికారులు పూర్తి నిమగ్నం
- జనం నుంచి వచ్చే అర్జీలు, విన్నపాలు పట్టించుకునే పరిస్థితి శూన్యం



ఈ నెల 20న స్వయం సహాయక సంఘాల సభ్యులతో యోగా కార్యక్రమం నిర్వహించేందుకు ఒంగోలులో స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఇప్పుడు ఎవరి నోట విన్నా యోగాంధ్ర.. అంటే యోగా పట్ల అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశం. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషిస్తుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. అయితే ఇదేమైనా కొత్తగా వచ్చిన సాఫ్ట్‌వేర్ తరహా విద్య కాదు. ఎప్పటి నుంచో ఉన్నదే. దీనిని ఆధునిక ప్రపంచంలో వచ్చిన మార్పుల్లో ఇప్పుడున్న యువత పట్టించుకునే పరిస్థితి లేదు. పలు రూపాల్లో వ్యాయామాలు వచ్చేశాయి. అయితే హఠాత్తుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాను ఎత్తుకున్నాయి. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని ప్రభుత్వం తరపున వైజాగ్‌లో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ వస్తున్నారు. దీంతో సిఎం చంద్రబాబు విశాఖ వెళ్లి ఏర్పాట్లపై పరిశీలించారు. యోగాంధ్ర పేరుతో నెల రోజుల పాటు భారీ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టడంతో యంత్రాంగం మొత్తం దీనిపైనే దృష్టి సారించింది. సమీక్షలు కూడా పెడుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు జిల్లాల్లో ఇదే కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అందరూ ఇదే పనిలో ఉన్నారు. పాకల బీచ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామితో పాటు కలెక్టర్ అన్సారియా, ఇతర ▶ 2లో

పరిపాలనపై యోగాంధ్ర ప్రభావం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అయితే యోగాంధ్ర వల్ల సాధారణ పరిపాలనపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఒకరకంగా చెప్పాలంటే అన్ని సమస్యలూ పక్కదారికి పోయాయి. కలెక్టర్ మొదలు మండలాల్లో తహాశీల్దార్లు, ఎంపీడీవోలు అందరూ ఇదే పనిలో ఉన్నారు. పలు రకాలుగా ప్రచారాలు, సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో రోజువారీ పాలనా వ్యవహారాలకు ప్రాధాన్యత తగ్గింది. ప్రజలను భాగస్వాములను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో రిజిస్ట్రేషన్, శిక్షణ, ప్రచార కార్యక్రమాలు ముమ్మరం చేశారు. గ్రామ సచివాలయాలకు వెళ్లినా, మండల ఆఫీసులకు వెళ్లినా యోగా తప్ప ఏమీ వినిపించడం లేదు. సాధారణ పరిపాలనతో పాటు ప్రజా సమస్యలూ పక్కదారి పడుతున్నాయి. రేషన్‌కార్డులు, సర్టిఫికెట్ల జారీ వంటి వ్యవహారాలకు ప్రాధాన్యత లేదు. రీ సర్వేలో వస్తోన్న తప్పిదాలపై కుప్పలుతెప్పలుగా అర్జీలు వస్తున్నాయి. వాటిని కూడా పక్కన పడేశారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. వాటిపై పరిశీలన అంతంతమాత్రంగానే ఉంది. తల్లికి వందనం కింద నగదు వేశారు. ఖాతాల్లో డబ్బులు పడని వాళ్లంతా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వారికి సమాధానం చెప్పేవాడే లేడు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులకు ముఖ్యంగా ఎస్సీ, బీసీ, ఎస్టీ విద్యార్థులకు పలు రకాల సర్టిఫికెట్లు కావాలి. వీటిని యుద్ధప్రాతిపదికన తహశీల్దార్లు జారీ చేయాలి. యోగాంధ్ర వల్ల ఇలాంటి వాటికి జాప్యం జరుగుతోందని తెలుస్తోంది.

కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉండటం లేదు. పై నుంచి కింది స్థాయి వరకూ అందరూ యోగాంధ్ర పనిలో నిమగ్నమై ఉన్నారు.

పాలస్తీనాపై యుద్ధం

సామ్రాజ్యవాద విస్తరణ కోసమే..

(మొదటిపేజీ తరువాయి)

ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని యుద్ధం నిలువరించాలని డిమాండ్ చేశారు. రక్తపాత యుద్ధాలతో విదేశీ వాణిజ్యం విస్తరించుకోవాలని అమెరికా వ్యూహాన్ని లౌకికవాదులు గుర్తించాలన్నారు. మార్కెట్ల పునర్విభజన కోసం సామ్రాజ్యవాద రాజ్యం సాగిస్తున్న విధ్వంసాన్ని ప్రతి పౌరుడూ ఖండించి పాలస్తీనాకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ హమాస్‌లోని గాజాను 24 గంటల్లో ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ ఒత్తిడి చేయడం వెనుక యుద్ధోన్మాదమే కారణమన్నారు. అతి చిన్న ప్రాంతం అయిన గాజాలో 22 లక్షల మంది ప్రజలు జీవిస్తున్నారని, వారందరినీ 24 గంటల్లో ఖాళీ చేయమని హుకుం జారీ చేస్తే ఎటు వెళ్లగలరని ప్రశ్నించారు. హమాస్‌లోకి వెళ్ళడానికి వీలు లేదని, పక్కనున్న జోర్డాన్ వెళ్ళడానికి వీలుకాని పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాజాను ఖాళీ చేయలేదు కనుక చంపుతున్నామని ఇజ్రాయిల్ అత్యంత క్రూరంగా ప్రకటించడం వెనుక అమెరికా సంపూర్ణ మద్దతే కారణమన్నారు. మార్కెట్ విస్తరణ కోసం అమెరికా సాగిస్తున్న సామ్రాజ్యవాద చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. భారత ప్రభుత్వం ఇజ్రాయిల్ పట్ల మెతక వైఖరిని అవలంబిస్తూ పాలస్తీనా ప్రయోజనాలకు మన దేశం ఇచ్చిన చారిత్రక మద్దతుకు అనుగుణంగా భారత ప్రభుత్వం సూత్రబద్ధమైన వైఖరి తీసుకోవాలని హితవు పలికారు. భారతదేశం పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించి.. ఇజ్రాయిల్‌కు సైనిక, భద్రతా సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలన్నారు. సామ్రాజ్యవాదానికి అంటకాగే మోడీకి కూటమి ప్రభుత్వం మద్దతుగా నిలవడం పట్ల అక్షేపణ వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలోని టిడిపి, జనసేన పాలస్తీనాకు సంఘీభావం తెలపాలని డిమాండ్ చేశారు.

సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.వెంకటరావు మాట్లాడుతూ ఇజ్రాయిల్ దాడుల్లో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలతో సహా కీలకమైన మౌలిక వసతులన్నింటినీ టార్గెట్ చేసుకుని ఉద్దేశ్యపూర్వకంగా ధ్వంసం చేస్తున్నారని దుయ్యబట్టారు. అత్యంత పాశవికంగా చేస్తున్న దాడులను వారు తీవ్రంగా ఖండించారు. సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు ఎంఎస్ సాయి మాట్లాడుతూ మార్కెట్ల పునర్విభజన కోసం సామ్రాజ్యవాద రాజ్యాల మధ్య పోటీ కోసమే అమెరికా సాగిస్తున్న యుద్ధోన్మాద చర్య అని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, వి.బాలకోటయ్య, బి.రఘురాం, బంకా సుబ్బారావు, ఉబ్బా ఆదిలక్ష్మి, నగర నాయకులు తంబి శ్రీనివాసులు, టి.మహేష్, ఎం.సుబ్బారావు, అమీర్, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి చొప్పర సాగర్, పద్మ, పి.సుబ్బారావు, ఎం.నారాయణరావు, ఆర్ మోహన్, రాజశేఖర్, నాంచార్లు, వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాలయం మాజీ చైర్మన్ రమేష్ మృతి

ప్రజాశక్తి-పొదిలి



స్థానిక పార్వతీ సమేత నిర్మామహేశ్వర దేవస్థానం (శివాలయం) మాజీ చైర్మన్ కంకణాల రమేష్(51) మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయన గత రెండు వారాలుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ చెన్నైలో చికిత్స పొందుతున్నారు. సోమవారం అర్ధరాత్రి తరువాత పరిస్థితి విషమించడంతో ఆయన మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు.

ఈ సందర్భంగా మృతదేహాన్ని మంగళవారం రాత్రి పొదిలికి తీసుకువచ్చారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో ఆయన స్థానిక శివాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా పని చేశారు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



తహశీల్దార్‌ను సన్మానిస్తున్న నరసింహబాబు

ఆలయ భూములను కాపాడాలి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు : ఆక్రమణదారుల నుంచి చిన్నగొల్లపల్లి చెన్నకేశవ స్వామి దేవాలయ భూములను కాపాడాలని ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరి రాజు నరసింహబాబు తహశీల్దార్ నాగూర్ మీరాకు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ చెన్నకేశవ స్వామి ఆలయ భూముల వ్యవహారంపై సమగ్ర విచారించి అన్యాక్రాంతమైన భూములను అప్పగిస్తామని హామీ ఇచ్చారు. వీరు వెంట ప్రజా హక్కుల వేదిక నాయకులు దూళిపాల మల్లికార్జున రావు ఉన్నారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

మహిళ మృతి, మరో నలుగురికి గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన కారు

ప్రజాశక్తి-టంగుటూరు

డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో కారులోని మహిళ మృతి చెందగా మరో నలుగురికి గాయాలైన సంఘట మంగళవారం వేకువజామున జరుగుమల్లిలో జరిగింది. జరుగుమల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కె.బిట్రగుంట సమీపంలో గల జార్ఖండ్ బీహార్ డాబా ఎదురుగా శింగరాయకొండ వైపు పోవు హైవేపై ఈ ప్రమాదం జరిగింది. మచిలీపట్నం నుంచి చెన్నై వెళ్తున్న కారు డ్రైవర్ నిద్రమత్తు కారణంగా అదుపు తప్పి డివైడర్ వాలుని డీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో కృష్ణకుమారి (65) అక్కడికక్కడే మృతి చెందింది. మచిలీపట్నం మండలం, చిన్నయాదరం గ్రామానికి చెందిన ఏసుబాబు, ఈయన కుమారుడు పిచ్చయ్య, పూజిత, సాయి అభిలాష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులను 108లో రిమ్స్‌కు తరలించారు. కారును హైవే పెట్రోలింగ్ వారి సహాయంతో పక్కకు తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. జరుగుమల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి

ప్రజాశక్తి-పీసీపల్లి



మృతి చెందిన మహేష్

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని బట్టుపల్లి సమీపంలో జరిగింది. కనిగిరి నుంచి పీసీపల్లికి ఇనుప చువ్వల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ బట్టుపల్లి సమీపంలో బోల్తా పడింది. ఇనుపలోడు అధికంగా ఉండటం వలన ట్రాలీ ఊడిపోయింది. ఇంజన్ పక్కకు పోవడంతో ఇంజన్ మీద ట్రాలీ పడింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న, అరటివేముల మహేష్ (30) పై ఇనుపచువ్వలు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనకు భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. ఎస్సై జి కోటయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ప్రభుత్వ వైద్యశాల తరలించారు.

బేకరీలో అగ్నిప్రమాదం

మూడు లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి -రేపల్లె

రేపల్లె రైల్వే స్టేషన్ సెంటర్ వద్ద మంగళవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యింది. మంటలు చెలరేగడంతో శ్రీ సాయి బేకరీ దుకాణం దగ్ధమైంది. తొలుత మంటలను గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక కేంద్రం అధికారులు ఘటనా స్థలానికి మంటలను అదుపు చేశారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిపారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-పొన్నలూరు

మండలంలోని మాలపాడు శివారులో పేకాట ఆడుతున్న వారిపై పొన్నలూరు పోలీసులు దాడి చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.16,540 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సింగరాయకొండ కోర్టులో హాజరుపరుచనున్నట్లు తెలిపారు.

ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-పామూరు

జాతీయ ఉపాధి పథకంలో పని చేస్తున్న కూలీలకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి యాటా వీరనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మంగళవారం మండల పరిధిలోని బుక్కాపురం గ్రామంలో ఉపాధి కూలీల పని ప్రదేశాన్ని సందర్శించారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరనారాయణ మాట్లాడుతూ చేసిన పనులకు బిల్లులు రాకపోతే కూలీలు వాళ్ల కుటుంబాన్ని ఎలా పోషించుకోగలరని సకాలంలో డబ్బులు రాకపోతే ఉపాధి పనులపై కూలీలు ఆసక్తి ఎలా చూపగలరని అన్నారు. వెంటనే ప్రభుత్వం పెండింగ్ బిల్లు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వేతనాలు ఇవ్వకపోతే కూలీల ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట మాజీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కే మాల్యాద్రి పాల్గొన్నారు.

హనుమంతునిపాడు : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హనుమంతునిపాడు ఎంపడీవో కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత మూడు నెలలుగా కూలీలు పనులు చేస్తుంటే బిల్లులు చెల్లించపోవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రస్తుతం పని చేస్తున్న కూలీల గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పని చేసే క్రమంలో చిన్నపాటి దెబ్బ తగిలినా కనీసం ప్రథమ చికిత్సకు కూడా అవకాశం లేదున్నారు. ఉపాధి కూలీలందరికీ ఉచిత భీమా సౌకర్యం కల్పించాలని రవాణా బాడుగ చెల్లించాలని కోరారు. మేట్లును ఏర్పాటు చేయటంతో పాటు వారికి అదనపు పారితోషకం ఇవ్వాలన్నారు. పెండింగ్‌లోని బిల్లులు వెంటనే విడుదల చేసి కూలీలకు ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మేట్లు కత్తి సామేలు, బాలయ్య, గురుస్వామి, రమణారెడ్డి, ఏసు, ఇజ్రాయిల్, ప్రభాకర్ రెడ్డి, కత్తి ఏబు, రాములు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ధర్నాకు సర్పంచ్ కత్తి రాజారావు సంఘీభావం తెలిపారు. ఎంపీడీవో రంగ సుబ్బారాయుడు మాట్లాడుతూ వారంలోపు ఉపాధి కూలీలందరికీ బిల్లులు పడేవిధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు



ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికులకు 'తల్లికి వందనం' వర్తింపజేయాలి

ప్రజాశక్తి-చీమకుర్తి: షరతులు లేకుండా తల్లికి వందనంతో సహా సంక్షేమ పథకాలన్నీ మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ కరోనా, తుఫాన్ ప్రకృతి వైపరీత్యాల సందర్భాలలో తమ ప్రాణాల సైతం పణంగా పెట్టి సేవలు చేస్తున్న కార్మికులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయకుండా షరతులు పెట్టడం అన్యాయం అన్నారు. గత ఎనిమిది నెలలుగా పారిశుధ్య కార్మికులకు చెల్లించిన విధంగా ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు జీవో ఎంఎస్ నెంబర్ 36 ప్రకారం రూ.21 వేలు, మరియు రూ.24,500 చెల్లించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులందరికీ ప్రభుత్వ పథకాలన్నీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికుల జీతాల సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఏడుకొండలు, పి.పద్మ పట్టణ నాయకులు నరసయ్య, పట్టణ నాయకులు టీ.నర్సయ్య, వి.శ్రీను, విక్టర్ పాల్, కోటేశ్వరరావు కోటేశ్వరి, వి.సుబ్బయ్య, కోటేశ్వరరావు, కోటేశ్వరి, సుబ్బయ్య, మోహన్, చెన్నమ్మ పాల్గొన్నారు.



పుస్తకం ఆవిష్కరస్తున్న వైసీపీ నాయకులు

ప్రభుత్వ వైఫల్యాలపై పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కనిగిరి: కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాల మేరకు ప్రభుత్వ వైఫల్యాలపై వైసీపీ కార్యాలయంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. నియోజకవర్గ వైసిపి నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలకు మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజల్ని వెన్నుపోటు పొడిచారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో హత్యలు అత్యాచారాలు పెరిగాయన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన సుపరిపాలనని, చంద్రబాబు నాయుడు పరిపాలన మోసపూరితమైన పరిపాలనని నాయకులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతి, వైసీపీ నాయకులు సూరసాని మోహన్ రెడ్డి, ఎర్రబల్లి దేవరాజు, బత్తుల మాలి, సిరప గోవర్ధన్ రెడ్డి, ముల్లంగి శ్రీహరి రెడ్డి, పోలక సిద్ధారెడ్డి, మల్లెల యాకోబు, శెట్టిపల్లి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాకు సంఘీభావంగా నిరసన

ప్రజాశక్తి-చీమకుర్తి




మాట్లాడుతున్న పల్లపల్లి ఆంజనేయులు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఖండిస్తూ ఇజ్రాయిల్ ఉన్మాదం నశించాలని, పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనం సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పూసపాటి వెంకట్రావు, మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ గత ఏడాదిగా ఇజ్రాయిల్ పాలిస్తీనాలోని గాజా మీద యుద్ధం చేస్తూ వేలాది మంది అమాయకులు, చిన్నపిల్లలు, 16,000 పైగా మహిళలు చనిపోయారని పేర్కొన్నారు. లక్షలాదిమంది నిరాశ్రయులు అయ్యారన్నారు. వారికి ప్రపంచవ్యాప్తంగా దేశాలన్నీ సంఘీభావం తెలిపాయన్నారు. కానీ మన దేశం సంఘీభావం తెలపకుండా ఉందన్నారు. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం నశించాలని, ప్రపంచ శాంతి కావాలని కోరారు. శాంతి కాముకులందరూ యుద్ధాన్ని వ్యతిరేకించాలని పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలపాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బెజవాడ శ్రీనివాసరావు, పొత్తూరి సురేష్, నల్లూరి కృష్ణయ్య, బొడ్డు ఓబులేసు, సిహెచ్ కొండయ్య, కొల్లూరు అక్కయ్య, వెంకటేశ్వర్లు, కొండయ్య పాల్గొన్నారు.

విశ్రాంత ఎంఈవో లక్ష్మయ్య మృతి

ప్రజాశక్తి-కనిగిరి



లక్ష్మయ్య(ఫైల్)

కనిగిరి పట్టణానికి చెందిన విశ్రాంత ఎంఈవో పాలకీటి లక్ష్మయ్య అనారోగ్యంతో ఒంగోలులో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు కనిగిరిలోని కొత్తపేటలో స్వగృహానికి తరలించారు. లక్ష్మయ్య పార్థివ దేహాన్ని సందర్శించి పలువురు నివాళులర్పించారు. సిపిఎం నాయకులు పీసీ కేశవరావు, ఆర్.మాలకొండయ్య లక్ష్మయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. లక్ష్మయ్య కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

తహశీల్దార్‌కు సర్పంచ్ కొండబాబు వినతి

ప్రజాశక్తి-పామూరు

ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తూర్పు కోడిగుడ్లపాడు సర్పంచ్ దారపునేని కొండబాబు తహశీల్దార్ వాసుదేవరాకు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని తూర్పు కోడిగుడ్లపాడు సర్వేనెంబర్ 110లో సుమారు 161 ఎకరా భూమి ఉందని, గత ప్రభుత్వం జగనన్న కాలనీకి కొంత కేటాయించారన్నారు. కాలనీ పక్కనే 167-బి హైవే రోడ్డు పడిందని, రోడ్డును ఆనుకొని సుమారు పది ఎకరాల భూమిని రెండు జెసిబిల ద్వారా చదును చేసి గట్లు వేస్తున్నారని తెలిపారు. ఫిర్యాదు మేరకు మంగళవారం తహశీల్దార్ వాసుదేవరావు భూమిని పరిశీలించారు. క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సాగు చేసి న వారు ఎవరు అనే విషయంపై విచారించాలని విఆర్‌ఓ చెన్నకేశవులు, సర్వేయర్‌ను ఆదేశించారు. భూమిని ఆక్రమించిన ఎంతటి వారైనా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అజయ్ కుమార్, మాజీ సర్పంచ్ దారపనేను రాజా, ప్రజలు పాల్గొన్నారు.

గాజాపై యుద్ధాన్ని ఆపాలి

సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీ



బాపట్లలో మాట్లాడుతున్న కొండయ్య

ప్రజావక్తి బాపట్ల

అమెరికా ప్రోత్సలంతో గాజా పై ఇజ్రాయిల్ సాగిస్తున్న దారుణాన్ని నిలిపివేసి గాజుపై యుద్ధాన్ని ఆపాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి. కొండయ్య తెలిపారు. వామపక్షాల పిలుపుమేరకు స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ యుద్ధంలో ఇప్పటివరకు చిన్నారులు, వృద్ధులు 60 వేల మంది పైచిలుకు చనిపోయారని తెలిపారు. ప్రపంచం యావత్తు యుద్ధాన్ని ఆపాలని గాజా ప్రజా ప్రజానీకాన్ని కాపాడాలని ఐక్యరాజ్యసమితితో సహా గట్టిగా మాట్లాడుతున్నప్పటికి ఇజ్రాయిల్ మూర్ఖంగా వ్యవహరిస్తోందన్నారు. దానికి భారత ప్రభుత్వం వత్తాసు పలకడం సరైన చర్య కాదన్నారు. ట్రంప్‌ను సంతప్తి పరచడానికి మోడీ ఆ విధ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భారతదేశం అలీన దేశంగా ఎవరి పక్షం చేరకుండా తతీయ ప్రపంచ దేశాలను కూటమిగా చేసుకుని సామ్రాజ్యా వాదానికి వ్యతిరేకంగా పోరాడే చరిత్ర భారతదేశానికి ఉందన్నారు. అందువల్ల భారతదేశం గాజాకు మద్దతు పలకాలన్నారు. సామ్రాజ్య వాదాన్ని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షుడు గుదే రాజారావు, సిఐటియు నాయకులు కె.శరత్, లక్ష్మణ, కే.నాగేశ్వరరావు, సుభాషిణి, స్పందన, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.


అద్దంకిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అద్దంకి : పాలస్తీనాపై ఇజ్రాయిల్ వైఖరి ఖండిస్తూ పాలస్తీనాకు మద్దతు తెలియజేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా సిపిఎం అద్దంకి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత సంవత్సరం కాలం నుంచి పాలిస్తీనాపై ఇజ్రాయిల్ అమానుషమైన దాడులు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆ దేశంలోని అమాయక ప్రజలు 40 వేల మందికి పైగా మరణించినట్లు తెలిపారు. లక్షలాదిమంది క్షతగాత్రులైనట్లు పేర్కొన్నారు. పసిపిల్లలు, మహిళలు అధిక సంఖ్యలో మృతిచెందినట్లు తెలిపారు. ఇజ్రాయిల్ సైన్యం కనీసం తినటానికి తిండి తాగటానికి నీరు కూడా లేకుండా అతి క్రూరంగా ప్రవర్తిస్తూ శరణార్థుల స్థావరాలపై బాంబుల దాడి చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా అమెరికా ఈ చర్యలకు మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంపు గాజా ప్రాంతాన్ని వదిలి వెళ్లిపోవాలని. వెళ్ళిపోయే వారికి పక్క దేశాలలో ఉండటానికి అవకాశం కల్పిస్తామని బహిరంగంగా మాట్లాడుతుంటే ఈ చర్యలను ఖండించాల్సిన భారతదేశ ప్రధానమంత్రి మోడీ ఒక్క మాట కూడా మాట్లాడకుండా మౌనం పాటిస్తున్నట్లు తెలిపారు. దీన్ని బట్టి చూస్తే ఈ చర్యలకు సహకరించటమేనని పేర్కొన్నారు. ఇప్పటికైనా గత చరిత్ర చూసుకుంటే భారతదేశం ఎప్పుడు పాలిస్తీనాకు మద్దతు తెలియజేస్తూ వచ్చిన సందర్భాలు అనేకంగా ఉన్నాయని గుర్తు చేశారు. ఈ దాడులను రాష్ట్రంలోని టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు ఖండించాలన్నారు. ఈ చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సభ్యులు ఎస్‌కె.కరీం, తోట వెంకటేశ్వర్లు, తన్నీరు రాజు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, ఫ్రూట్ వెండర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో శాస్త్రీయ అవగాహన పెంపొందించాలి


ఎంఇఒకు సభ్యత్వ రసీదు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి బాపట్ల

ప్రజల్లో శాస్త్రీయ అవగాహన పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వై. భాస్కరరావు అన్నారు. మండల విద్యాశాఖ అధికారి ఎస్. నిరంజన్‌కు జెవివి సభ్యత్వం రసీదును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ మూఢనమ్మకాలను పారదోలేందుకు, ప్రజల్లో మార్పు కోసం జనవిజ్ఞాన వేదిక నిరంతరం పోరాడుతుందన్నారు. మూఢ నమ్మకాలను పారద్రోలి సైన్సు పట్ల అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన మరింత పెంపొందించాలన్నారు. సమాజంలో మూఢనమ్మకాలు పారదోలెందుకు ప్రతి ఒక్కరూ జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకుడు కోట వెంకటేశ్వర రెడ్డి, న్యాయవాది లంబు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

'పిఎంఎఫ్‌ఎంఇ'ను అందిపుచ్చుకుని..

వ్యాపారవేత్తలుగా ఎదగాలి : కలెక్టర్

ప్రజాశక్తి-వేటపాలెం,చీరాల

ప్రధానమంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి జీవనోపాది (పిఎంఎఫ్‌ఎంఇ) పథకాన్ని అందిపుచ్చుకుని వ్యాపార వేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. మండల పరిధిలోని ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి జీవనోపాధి లబ్ధిదారుల యొక్క యూనిట్లను మంగళవారం పరిశీలించారు. తొలుత ప్రసాద్ నగర్ లోని శ్రీ సాయి తేజ వేరుశనగ శుద్ధి యూనిట్‌ను పరిశీలించారు. ఆ యూనిట్ వల్ల లాభనష్టాలు, వ్యాపార సరళి, ముడి సరుకు కొనుగోలు వివరాలను యూనిట్ యజమానిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తపేటలోని బాల ఆగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సాయి తేజ వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్ స్థాపనకు పిఎంఎఫ్‌ఎంఇ పథకం ద్వారా రూ.10 లక్షల రుణం పొందినట్లు తెలిపారు. ఇందులో 35 శాతం సబ్సిడీ కింద వస్తుందన్నారు. యూనిట్ స్థాపన వల్ల స్థానికంగా 10 మందికి ఉపాధి కల్పన లభించినట్లు తెలిపారు. అనంతరం బాల ఆగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో అమ్మ చిల్లి పౌడర్ అనే బ్రాండ్ తో కారం పొడి ఉత్పత్తి జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రస్తుతానికి ఈ యూనిట్లో విద్యుత్ సమస్యల వలన ఉత్పత్తి జరగటం లేదని, ఈ సమస్యలను త్వరలో పరిష్కరించి యూనిట్ పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటామనికలెక్టర్ యూనిట్ యాజమాన్యానికి భరోసా ఇచ్చారు. ఆహార శుద్ధి వ్యాపార రంగంపై ఆసక్తి ఉన్న వారు పిఎంఎఫ్‌ఎంఇఎపి.ఒఆర్జి అనే వెబ్ సైట్ , లేదా జిల్లా రిసోర్స్ పర్సన్ ఎం.శ్రావణి 9381155919 సెల్ నంబరు ద్వారా సంప్రదించి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఖలీం, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, చీరాల రెవెన్యూ అధికారి చంద్రశేఖర్, తహశీల్దారు గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కారంపొడి ఉత్పత్తి యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్


క్విజ్ పోటీలకు హాజరైన విద్యార్థులు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మాజీ రాజ్యసభ సభ్యులు, సిపిఎం నాయకులు రేపల్లె నియోజకవర్గం తొలి ఎమ్మెల్యే కామ్రేడ్ మోటూరు హనుమంతరావు 24వ వర్ధంతిని పురస్కరించుకొని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు భారత రాజ్యాంగం యొక్క విశిష్టత, ప్రజాస్వామ్య విలువలు అనే అంశంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ క్విజ్ పోటీలకు మాస్టర్ గా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గుర్రం మురళీ మోహన్ వ్యవహరించారు. ఈ పోటీలను పాఠశాల హెచ్ఎం కె.అరుణ కుమారి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి. మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఈ పోటీల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికి చేసేందుకు దోహద పడుతుందన్నారు. విజేతలకు జులై 18న మోటూరు హనుమంతరావు 24వ వర్ధంతి సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు వెల్లటూరులో మోటూరు వర్ధంతి

మండల పరిధిలోని వెల్లటూరులోనున్న మోటూరు హనుమంతరావు విగ్రహం వద్ద బుధవారం ఉదయం 8 గంటలకు వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి జి.సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి, సిపిఎం రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


సిడిపిఒకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల వినతి

ప్రజాశక్తి - నిజాంపట్నం

తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు తమకూ అమలు చేయాలని కోరుతూ మండల పరిధిలోని పల్లపట్ల అంగన్‌వాడీలు సిడిపిఒ అనసూయను మంగళవారం వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపుతూ వారికి తల్లికి వందనం అమలు చేయలేదని తెలిపారు. దీంతో తమ పిల్లల చదువు కోసం అంగన్‌వాడీలు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. తక్కువ వేగంలో ఎక్కువ పనిచేస్తున్నట్లు తెలిపారు. గౌరవ వేతనంగా నెలకు రూ. 11,500 ఇస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయక పోతే వారు ఎలా బతకాలని ఆయన ప్రశ్నించారు. అంగన్‌వాడీలకు తల్లికి వందనంతో పాటు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ పల్లపట్ల ప్రాజెక్ట్ అధ్యక్షురాలు వై.మేరీమణి,ఉష,బేబీ రాణి,గాయత్రి, రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోండి

- లక్ష్యాల సాధనకు కృషి
- మెప్మా అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదిగేలా చూడాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, మెప్మా అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం ఒంగోలు కలెక్టరేట్ లో సమావేశ మందిరంలో కలెక్టర్ మెప్మా అధికారులతో సమావేశమై జిల్లాలో పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ద్వారా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల అమలును సమీక్షించి దిశానిర్దేశం నిర్దేశం చేశారు. జిల్లాలో 9545 స్వయం సహాయక సంఘాలు, 326 మురికివాడ సంఘాలు మరియు 8 పట్టణ సంఘాలు, 326 మంది రిసోర్స్ పర్సన్స్ స్లమ్ ఫెడరేషన్ మరియు పట్టణ సమాఖ్య కింద విధులు నిర్వహిస్తున్నారని, మహిళాకాసం యాప్లో స్వయం సహాయక సంఘాల గురించి సమగ్ర సమాచారాన్ని అప్లోడ్ చేస్తున్నట్లు మెప్మా పిడి శ్రీ హరి కలెక్టర్కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఒంగోలు నగరంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగా కార్యక్రమంలో సంఘ సభ్యులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సభ్యులందరూ కచ్చితంగా ఉదయం 6 గంటలకు హాజరైలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, మెప్మా పిడి ని ఆదేశించారు. సమావేశంలో మెప్మా పీడీ శ్రీహరి, సిఒలు, ఆర్పిలు పాల్గొన్నారు.

యోగాను పకడ్బందీగా నిర్వహించండి: కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఈనెల 20వ తేదీ స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమాన్ని పకడ్బందీగా జరపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమం ఏర్పాట్లల్లో భాగంగా స్థల పరిశీలనకు మంగళవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలసి ఒంగోలు నగరంలోని మినీ స్టేడియం, పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం, ఏబిఎం కళాశాల మైదానాలను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మి ప్రసన్న, మెప్మా పీడీ శ్రీ హరి, డిఆర్డిఏ పీడీ నారాయణ, డిఎస్డిఒ జి.రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి..

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఈ నెల 22న గుంటూరులో జరగనున్న పూర్వ విప్లవ విద్యార్థి సంఘ సదస్సును జయప్రదం చేయాలని పూర్వ విద్యార్థుల సంఘం విజ్ఞప్తి చేసింది. మంగళవారం నాడు స్థానిక మల్లయ్య లింగం భవన్లో జరిగిన మీడియా సమావేశంలో పలువురు మాట్లాడారు. విప్లవ విద్యార్థి సంఘం నిషేధంతో విద్యార్థి ఉద్యమం వెనుకపట్టు పట్టిందని, కార్పొరేటీకరణ విస్తరిస్తోందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా విప్లవవిద్యార్థుల సంఘ పూర్వ రాష్ట్ర నాయకులు వై రాజశేఖర్ మాట్లాడుతూ మావోయిస్టులను ఏరివేసే పేరున కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ ఖగార్ పేరుతో ఆదివాసీలను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపేస్తున్నట్లు ఆరోపించారు. ఈ దమనకాండకు నిరసనగా ఈ నెల 22న గుంటూరు ఎన్ జిఒ హోమ్ (చాగంటి భాస్కరరావు మెమోరియల్ హాలు)వద్ద విప్లవ పార్టీ విద్యార్థుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సు ను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సదస్సు వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో విప్లవ పార్టీ పూర్వ విద్యార్థి, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసి రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, నల్లూరి క్రాంతి, పి శ్రీనివాస్, అద్దంకి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కార్ డ్రైవింగ్లో శిక్షణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు రూడ్సెట్ సంస్థలో ఈ నెల 20 నుంచి 30 రోజుల పాటు ఉచితంగా కార్ డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి ఒంగోలు జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెంది ఉండి ఆధార్ కార్డ్, రేషన్ కార్డు మరియు ఎల్ఎల్ఆర్ కలిగి ఉండాలన్నారు. శిక్షణా కాలంలో భోజనం, వసతి ఉచితంగా కల్పించబడునని తెలిపారు. మరిన్ని వివరాలకు 9573363141 నెంబర్ను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బుధవారం ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు లాయర్పేట ఫీడర్లో లైనుకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించటం కోసం విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని టౌన్ డిఇఇ కెవి.పాండురంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ పార్కు, మాంటిస్సోరి స్కూల్, కొండయ్య బంకు రోడ్డు, టెంపుల్ టవర్, సాయిబాబా టెంపుల్ వెనుక వైపు, రంగారాయుడు చెరువు టర్నింగ్, రైతు బజారు, సంఘం డెయిరీ లైన్, సాయిబాబా గుడి, లాయర్ పేట, విఐపి రోడ్, ఐబాకో ఐస్ క్రీమ్ పార్లర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

పోర్ట్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ చైర్మన్గా ఖలీఫాతుల్లా బాషా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆల్ ఇండియా పోర్ట్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ చైర్మన్గా షేక్ ఖలీఫాతుల్లాబాషాను నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు ఇచ్చింది. మంగళవారం నాడు ఢిల్లీలో ఆల్ ఇండియా వర్కర్స్ ఫెడరేషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చైర్మన్ ఆర్నబ్ చట్టార్జీ నియామక పత్రాన్ని అందజేశారు. పోర్ట్ మినీ స్ట్రేరీ నుంచి విశాఖపట్నం పోర్ట్ చైర్మన్ కు నియామక పత్రం పంపినట్లు అధికారులు తెలిపారు. ఆయన ఈ పదవిలో మూడు సంవత్సరాలు కొనసాగుతారు. ఆంధ్రప్రదేశ్లో ఉన్న ఐదు పోర్టులలో ఉన్న వర్కర్ల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం కోసం నిర్దేశించిన బాధ్యత సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన ప్రకటించారు.

విద్యార్థి దశలోనే భవిష్యత్తుపై అవగాహన పెంచుకోవాలి

కలెక్టర్ తమీమ్అన్సారియా




మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విద్యార్థి దశలో ఉన్నప్పుడే తమ భవిష్యత్తు పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్అన్సారియా విద్యార్థులకు సూచించారు. మంగళవారం నాడు స్థానిక డిఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉజ్వల భవిష్యత్తు పేరుతో విద్యార్థులకు అవగాహన కల్పించేలా రూట్ టు రైజ్ ట్రైవ్ ఫౌండేషన్ మరియు జిల్లా బాలల వనరుల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కెరియర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న మార్పులను నిరంతరం గమనిస్తూ ఉండాలని విద్యార్థులకు సూచించారు. పాఠాలతో పాటు పాఠ్యాంశేతర విషయాల్లోనూ విద్యార్థులు రాణించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ విషయాలపై అవగాహన కల్పించేందుకు ఈ కెరియర్ గైడెన్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. డివిజన్ల స్థాయిలోనూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు.

కాగా, వివిధ రంగాలలో అందుబాటులో ఉండే ఉద్యోగ అవకాశాలను తెలియజేసేలా ఏర్పాటుచేసిన స్టాల్స్ ను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఆయా విషయాలను వీటి నిర్వాహకులు ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. ఇంజనీరింగ్, వైద్య, ఆర్థిక, న్యాయ, భారత నావికాదళం, పోలీసు, రైల్వే విభాగాల స్టాల్స్తో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల స్పందన విభాగం వారు వివిధ పరికరాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యక్తిగత శుభ్రత, మంచి ఆహారపు అలవాట్లు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ పీడీ సువర్ణ, జిల్లా ఉప విద్యాధికారి చంద్రమౌళేశ్వర్, డిసిపిఓ దినేష్ కుమార్, బంగారు బాల్యం జిల్లా నోడల్ ఆఫీసర్ గిరిధర్ శర్మ, రూట్ టు రైజ్ ట్రైవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు రషీదా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న షహనాజ్

యువతి చదువుకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఇస్లాంపేటకు చెందిన షేక్ ఎద్దాని క్యాన్సర్తో ఇటీవలే చనిపోయారు. ఆమె కూతురు ఆఫ్రిన్కి పదో తరగతిలో 600కి 562 మార్కులు వచ్చాయి. కుటుంబ పోషణ భారంగా మారి.. చదువు ఆపేసే పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న సూర్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ షహనాజ్ ప్రవాస భారతీయురాలు సిరితో మాట్లాడి ఆఫ్రిన్కి కాలేజీ ఫీజు మరియు పుస్తకాలు నిమిత్తం మంగళవారం నాడు ట్రస్టు కార్యాలయంలో సయ్యద్ షహనాజ్ ట్రస్ట్ సెక్రటరీ సర్దార్ చేతులమీదుగా రూ.34 వేల చెక్ అందజేశారు. భవిష్యత్తులో కూడా ఆఫ్రిన్కి చదువు నిమిత్తం సహాయ సహకారాలు అందజేస్తామని తెలియజేశారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీ మాగుంట

పిఎసి సమావేశంలో 'మాగుంట'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజా పద్దుల కమిటీ(పిఎసి) సమావేశంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. మంగళవారం ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో ప్రజా పద్దుల కమిటీ చైర్మన్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం జరిగింది. సమావేశంలో కమిటీ సభ్యులు, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొని పలు సూచనలు చేశారు. సమావేశంలో ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత



సమ్మె నోటీస్ అందజేస్తున్న యూనియన్ నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జులై 9న జరిగే దేశవ్యాప్తంగా జరిగేలో సమ్మెలో ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల హమాలీలు పాల్గొంటున్నట్లు పౌర సరఫరాల హమాలీల యూనియన్ (సిఐటియు) సమ్మె నోటీసు ఇచ్చింది. మంగళవారం నాడు పౌరసరఫరాల సంస్థ ప్రకాశం జిల్లా మేనేజర్ జి వరలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ ఉషారాణిలను కలిసి నోటీసు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు హమాలీల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు అమలుచేయడంలో పోటీ పడుతున్నాయని, అందులో భాగంగానే కార్మిక వ్యతిరేక చర్యలను రాష్ట్రప్రభుత్వం మరింత వేగంగా ఉత్సాహంగా అమలు చేయటానికి కావలసిన ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. కార్మిక వ్యతిరేక చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేల రూపాయలు నిర్ణయించి అమలు చేయాలని, ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి షెడ్యూల్ ఎంప్లాయిస్ లో వేతన సవరణ చేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ,హమాలీలకు వెల్ ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాదంలో చనిపోయిన హమాలీలకు రూ.10 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు జులై 9న సమ్మె చేస్తున్నామని పేర్కొన్నారు. నోటీస్ సమర్పించిన వారిలో హమాలీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భత్తుల గోపాలరావు, సంజీవరావు, ఓ వెంకట్రావు,పి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్లకు రాష్ట్ర విద్యా కమిషనర్ విజయరామరాజు ఆదేశం



వీడియోకాన్ఫరెన్స్లో పాల్గొన్న కలెక్టర్ తమీమ్అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఈ నెల 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనే విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పాఠశాల విద్య కమిషనర్ వి.విజయరామరాజు సూచించారు. మంగళవారం రాష్ట్ర కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాతో పాటు సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయరామరాజు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో ఈనెల 18, 19, 20 తేదీలలో ప్రతిరోజు సాయంత్రం ఒక గంట సేపు యోగాసనాలు సాధన చేయించాలన్నారు. ఆయా విషయాలపై మండల స్థాయి ప్రత్యేక అధికారులతో టెలీ కాన్ఫరెన్ నిర్వహించి దిశా నిర్దేశం చేయాలని కలెక్టర్లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, జడ్పీ సిఈఒ బి.చిరంజీవి, ఆయుష్ విభాగ సీనియర్ వైద్యులు భీమ్ నాథ్, డిప్యూటీ జిల్లా విద్యాధికారి చంద్రమౌళీశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - రేపల్లె

యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చునని యోగా మాస్టర్ పోలయ్య బాబు తెలిపారు. చల్లపల్లి జామిందారు కోట వద్ద రేపల్లె ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు, ఎన్‌సిసి క్యాడెట్లు యోగాసాసనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పోలయ్య బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాపై చైతన్యవంతులు కావాలన్నారు. నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి ఉల్లాసంగా ఉంటారన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చుని తెలిపారు. మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. ఈ నెల 21న నిర్వహిస్తున్న యోగా డేలో విద్యార్థులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం. దాసు, ఎన్‌సిసి ఆఫీసర్ కె.బాలగురవయ్య, రసాయన శాస్త్ర విభాగ అధిపతి బి. కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్చూరు : మండల పరిధిలోని ఉప్పుటూరు ఎంపీపీ స్కూల్, జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు యోగ మాస్టర్ ట్రైనర్, మండల పర్యవేక్షణ అధికారి, ఉప్పుటూరి హోమియో వైద్యనిపుణులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యోగాపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత యోగాసానాలు వేయించారు. యోగ ఆసనాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్కూల్ హెడ్మాస్టర్లు, అధ్యాపకులు, ఉప్పుటూరు సచివాలయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి- భట్టిప్రోలు



భట్టిప్రోలులోని విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ పూర్వ విద్యార్థిని వాకా నేహశ్రీకి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) ఖరగ్పూర్‌లో సీటు లభించింది. నేహశ్రీకి ఐఐటిలో సీటు రావడం గర్వకారణంగా ఉందని పాఠశాల కరస్పాండెంట్ వెంకట్రావు అన్నారు. వాకా సతీష్, పద్మిని ప్రియ దంపతుల కుమార్తె నేహ శ్రీ విశ్వశాంతి పాఠశాలలో 2010-2011 నుంచి 2022-2023 వరకూ విద్యనభ్యసించినట్లు తెలిపారు. 2017-18 లో నవోదయ సీటు వచ్చినప్పటికీ వెళ్లకుండా ఇదే పాఠశాలలో 10వ తరగతి వరకూ చదివినట్లు తెలిపారు. పదో తరగతిలో 593 మార్కులతో స్టేట్ 3వ ర్యాంక్, ఇంటర్మీడియట్ లో 989 మార్కులతో స్టేట్ 4 వ ర్యాంకును సాధించినట్లు తెలిపారు. జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలలో 4191 ర్యాంకు సాధించి ఖరగ్‌పూర్‌లో మెకానికల్ ఇంజినీర్ బ్రాంచిలో సీటు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫణి పార్థ సారధి, పాఠశాల కరస్పాండెంట్ వెంకట్రావు, ఉపాధ్యాయులు నేహశ్రీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

'సూర్యఘర్'తో ప్రయోజనం

ప్రజాశక్తి- చెరుకుపల్లి

పిఎం సూర్యఘర్ పథకంతో విద్యుత్ వినియోగదారులకు మేలు జరుగుతుందని విద్యుత్ శాఖ నోడల్ అధికారి తులసి రామ్ తెలిపారు. చెరుకుపల్లి సబ్ డివిజన్ పరిధిలోని అధికార్నులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసీరామ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పిఎం సూర్యఘర్ పథకాన్ని నివాస గృహాలు, వ్యాపార సంస్థలు, దుకాణదారులు వినియోగించుకోవాలన్నారు. సూర్య ఘర్ పథకం ద్వారా ఇళ్లపై ఏర్పాటు చేసుకున్న సోలార్ పలకలతో ఇంట్లో విద్యుత్ వినియోగం చేసుకోవచ్చని దీని ద్వారా విద్యుత్ బిల్లులు ఉండవన్నారు. వినాణ్యమైన విద్యుత్‌ను పొందవచ్చునని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశానిన సద్వినియోగం చేసుకవోఆలన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్ బాబు, విద్యుత్ శాఖ సిబ్బంది, చెరుకుపల్లి, నగరం, పిట్టలవానిపాలెం, నిజాంపట్నం మండలాల ఏఈలు, జేఈలు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఏడాది పాలనలో అంతా మోసమే

వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్ బాబు

ప్రజాశక్తి-వేమూరు

కూటమి ఏడాది పాలన అంతా మోసమేనని వైసిపి వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్ బాబు తెలిపారు. 'జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నేతలు సూపర్ సిక్స్ తో పాటు 143కి పైగా హామీలిచ్చి ప్రజలను అన్ని విధాలా మోసం చేశారని ఆరోపించారు. ఏడాది పాలలో అభివద్ధి చేయకపోగా, వారు చేసిన మోసాలను,అరాచకాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. కూటమి ఏడాది పాలనంతా విధ్వంసమేనని అశోక్ బాబు మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు,పాల్గొన్నారు.



వేమూరులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వరికూటి అశోక్‌బాబు, వైసిపి నాయకులు

చెరుకుపల్లి : కూటమి ప్రభుత్వ ఏడాది పాలన కక్ష సాధింపు చర్యలు, అక్రమ కేసులు, వైఫల్యాల మయంగా మారిందని వైసిపి రేపల్లె నియోజక సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ తెలిపారు. కూటమి ప్రభుత్వ ఏడాది పరిపాలనకాల వైఫల్యాలపై వైసిపి రూపొందించిన పుస్తకాన్ని డాక్టర్ గణేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాయ మాటలు చెప్పి తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మొదటి మూడు నెలలు వైసిపి మద్దతుదారులపై దాడులు, తరువాత మూడు నెలలు అక్రమ కేసులు, తర్వాత మూడు నెలలు వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసుల నమోదు, ప్రజల దృష్టి మళ్ళించే విధంగా ఏదో ఒక అంశాన్ని తెరపైకి తీసుకు వచ్చి పరిపాలన సాగిస్తుందని విమర్శించారు. ముఖ్యమైన పథకాలను అమలు చేయకుండా రాజధాని అమరావతి అభివద్ధి పేరుతో విపరీతంగా అప్పులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ మదన్మోహన్, బొర్రా శ్రీనివాసరావు , కాటూరి శివ నాగబాబు, వైసిపి మండల కన్వీనర్ దుండి వెంకటరామిరెడ్డి, నగరం మండల కన్వీనర్ ఇంకొల్లు రామకష్ణ, నిజాంపట్నం మండల కన్వీనర్ రాంబాబు, నిజాంపట్నం కోటేశ్వరరావు, బాపనయ్య, వంగర భాను ప్రసాద్, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



చెరుకుపల్లిలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ గణేష్, నాయకులు

అధికారుల తప్పులు .. అన్నదాతలకు తిప్పలు..

ప్రజాశక్తి- సిఎస్పురం రూరల్

భూముల రీ సర్వే సందర్భంగా రెవెన్యూ సిబ్బంది చేసిన తప్పులకు అన్నదాతలు తిప్పలు తప్పడం లేదు. మండల పరిధిలోని ఉప్పలపాడు, బోడావుల దిన్నె, అరివేముల, కోమటిగుంట్ల, చెన్నపునాయుని పల్లి, బొంతవారి పల్లి, నల్లమడుగుల, ముండ్లపాడు, కోవిలంపాడు, చింతపూడి తదితర గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తి చేశారు. రీ సర్వే సందర్భంగా ఒకరి ఆధార్ నెంబరు మరొకరి ఖాతాకు అనుసంధానం చేశారు. దీంతో తక్కువ భూ విస్తీర్ణం ఉన్నవారికి ఎక్కువగా భూమి ఉన్నట్లు నమోదు అయ్యింది. కొద్ది మందికి భూవిస్త్రీర్ణం తగ్గించి నమోదు చేశారు. ఈ తప్పులు సవరించేందుకు ప్రభుత్వం నుంచి అప్షన్ రాలేదు.దీంతో తప్పులు సరిచేసే అవకాశం లేకుండా పోయింది. భూమి ఎక్కువగా ఉన్నట్టుగా ఆన్‌లైన్ చూపిస్తుండడంతో అనేక మందిని తల్లికి వందనం పథకానికిఅనర్హులుగా ప్రకటించారు. దీంతో తప్పులు సరి చేయాలని కోరుతూ రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కోమటిగుంట్ల రెవెన్యూలో పొలం తక్కువగా ఉన్నవారికి ఎక్కువ ఉన్నట్లుగా ఆన్‌లైన్‌లో చూపిస్తుండడంతో దాదాపు పది మంది రైతులు తల్లికి వందనం పథకానికి అనర్హులుగా ప్రకటించారు. తన పేరుతో ఉన్నా భూమిని 2 ఎకరాలు తక్కువగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, తన ఆధార్ నెంబర్‌ను ఎక్కువ పొలం ఉన్న వేరే వారి ఖాతాకు అనుసంధానం చేశారని, సరి చేయమంటే అధికారులు ఆప్షన్ లేదని చెబుతున్నట్లు దర్శికుంట్ల గ్రామానికి చెందిన బత్తుల మోహన్ రాజు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తప్పులను సరిచేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దారు పి.వెంకటేశ్వర్లు ప్రజాశక్తి వివరణ కోరగా తప్పులను సరి చేయడానికి ఆప్షన్ ఇవ్వలేదని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెస్తాని తెలిపారు.

పొలం ఎక్కువగా నమోదు చేశారు

గిద్ద రమణయ్య, ఉప్పలపాడు



మాకు మూడు సర్వే నెంబర్లలో రెండు ఎకరాల పొలం మాత్రమే ఉంది. ప్రస్తుతం 10 ఎకరాలు పొలం ఉన్నట్లుగా ఆన్‌లైన్‌లో చూపిస్తుంది. దీంతో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందే అవకాశం లేకుండా పోయింది. సరిచేయాలని రెవెన్యూ అధికారులను అడిగితే ఏదేదో చెప్తున్నారు. ఏం చేయాలో పాలుపోవడం లేదు.

తల్లికి వందనం పథకం రాలేదు

చిట్ల నారాయణ, కోమటిగుంట్ల



మాకు రెండు సర్వే నెంబర్లలో 3.50 ఎకరాల పొలం ఉంది. ప్రస్తుతం 10.40 ఎకరాల పొలం ఉన్నట్లుగా ఆన్‌లైన్‌లో చూపిస్తుంది. దీంతో తల్లికి వందనం పథకంలో అనర్హుల జాబితాలో మా పేరు వచ్చింది. సరిచేయాలని అధికారులను కోరితే ఆప్షన్ రాలేదని చెబుతున్నారు.

నేడు పొగాకు రైతుల ధర్నా

ప్రజాశక్తి- ఇంకొల్లు

నల్లబర్లీ పొగాకు కొనుగోలు విషయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు తెలిపారు. ఇంకొల్లు అంబేద్కర్ నగర్‌లో పొగాకు రైతులతో రైతు సంఘం నాయకులు మంగళవారం మాట్లాడారు. ఈ సందర్భంగా హెచ్‌డి బర్లీ పొగాకు సాగుచేసిన రైతులు, కౌలు రైతులు పలువురు రైతు సంఘం నాయకులతో తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఈ సందర్భంగా గత నాలుగు నెలలుగా రైతు సంఘాల ఆధ్వర్యంలో వివిధ రకాలుగా పొగాకు రైతులకు అండగా బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని పోరాటంలో చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదని తెలిపారు.

నేడు మార్కెట్ యార్డ్ వద్ద పొగాకు రైతులు ధర్నా

పొగాకు కొనుగోలు చేయాలని కోరుతూ ఇంకొల్లు మార్కెట్ యార్డు వద్ద బుధవారం ధర్నా కార్యక్రమాన్ని చేపట్టినట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, జిల్లా ఉపాధ్యక్షుడు, కందిమళ్ల రామ కోటేశ్వరరావు తెలిపారు.పొగాకు రైతులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



ఉపాధి పనుల్లో పాల్గొన్న వరికూటి అశోక్‌బాబు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి - కర్లపాలెం

జవాబు దారీతనంతో గ్రామాలల్లో మరింత పారదర్శకంగా పనులు చెప్పట్టాలనే ఉద్దేశ్యంతో సామజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిడబ్ల్యుఎం ఏపీడీ విజయలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ 2024-25 ఏడాదిలో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా మండల వ్యాప్తంగా రూ.5.69 కోట్లు పనులు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీలలో జరిగిన ఉపాధి పనులపై గ్రామాల వారీగా సామాజిక తనిఖీ బందం వివరించారు. ఈ కార్యక్రమములో ఏపీడీ సువార్త, ఎంపీడీఓ అద్దూరి శ్రీనివాసరావు, ఎంపీపీ యరం వనజ,సర్పంచి నక్కా లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిడబ్ల్యుఎం ఏపీడీ

అశోక్ బాబు చొరవతో ఉపాధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అమృతలూరు : అమృతలూరు మండలం మోపర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని మాతిపాలెం ఎస్‌సి సామాజికవర్గానికి చెందిన 70 కుటుంబాలకు వైసిపి సానుభూతిపరులు అని వారికి ఉపాధి పనులు కల్పించకపోవడం హేయ మైనా చర్య అని వైసిపి వేమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్ బాబు విమర్శించారు. తమకు ఉపాధి హామీ పనులను తాముకు కల్పించడం లేదని గ్రామస్తులు అశోక్‌బాబు దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో స్పందించిన అశోక్ బాబు అధికారులతో మాట్లాడితో మంగళవారం పనులు ప్రారంభించేలా కృషి చేశారు.

ప్రజాశక్తి
7
బుధవారం 18 జూన్ 2025

'పచ్చిరొట్ట'తో భూసారం పెంపు : ఎఒ

ప్రజాశక్తి -అద్దంకి

పచ్చిరొట్ట పంటల సాగుతో భూసారం పెరుగుతుందని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని ధర్మవరం,శంఖవరప్పాడు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ 20 రకాల విత్తనాలు కలిపిన కిట్లు రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. దీని వలన 35 నుంచి 45 టన్నుల పచ్చిరొట్ట ఎరువు తయారవుతుందన్నారు. ఫలితంగా భూమిలో కర్బనశాతం పెరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు,గ్రామ వ్యవసాయ సహాయకులు రోజీ తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు : మండల పరిధిలోని అనంతవరం, చిలుమూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ నరేంద్రబాబు ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఆధ్వర్యంలో 50 శాతం సబిడీస్పై పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంబ నాయక్, విఎఎ వినీత, రైతులు తదితరులు పాల్గొన్నారు

వేటపాలెం : అన్నదాత సుఖీభవకు సంబంధించిన పెండింగ్ ఇకెవైసిపి పూర్తి చేయించు కోవాలని చీరాల సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రత్న కుమారి తెలిపారు. మండల పరిధిలోని కొత్తపేట -3 , పాపాయపాలెం రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు జీలుగ, జనుము విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. తద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. ఎఒ సరిత



అద్దంకిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ

దోస పంటను పరిశీలించి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, కలుపు యాజమాన్యం గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ గోపికృష్ణ గ్రామ వ్యవసాయ సహాయకులు శివ నాగబాబు , వినయ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

బపంగులూరు : రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందాలని ఎఒ డి. సుబ్బారెడ్డి కోరారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామకూరు, నార్నివారిపాలెం గ్రామాల రైతులతో ఆయన మాట్లాడారు. రైతులు వ్యవసాయ అధికారులు సంబంధిత శాస్త్రవేత్తలు సూచనలను ఎప్పటికప్పుడు పాటిస్తూ, వ్యవసాయాన్ని ఆధునిక పద్ధతుల్లో చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పధ్వి సాయి, రైతులు పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలపరిధిలోని పోలూరు, శ్యామల వారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్చూరు సహాయ సంచాలకులు మోహన్ రావు మాట్లాడుతూ రైతులు సీజన్ ప్రారంభంలో భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించుకోవాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులు వినియోగించడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యద్దనపూడి కుమారి, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

కర్లపాలెం : మండల పరిధిలోని ఏట్రవారిపాలెం గ్రామంలో పొలంపిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ సుమంత్ కుమార్ మాట్లాడుతూ పంటలు సాగు చేసే రైతులు భూమిలో ఉండే పోషకాల ఆధారంగా ఎరువులను వినియోగించాలన్నారు. కౌలు దారులు తప్పని సరిగా రెవెన్యూ అధికారులను సంప్రదించి కౌలు కార్డులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు పూజశ్రీ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : నేల స్వభావానికి అనుగుణంగా పచ్చిరొట్ట ఎరువుల సాయంతో భూమిని సారవంతంగా చేయవచ్చుని ఎఒ షేక్ సైదా తెలిపారు. మండల పరిధిలోని అడవి పాలెం, వెల్లలచెరువు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు జీలుగులు, జనుములు 50 శాతం సబ్సిడీతో రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలలో విలేజి అగ్రికల్చరల్ అసిస్టెంట్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దిండు హనుమంతరావు, ఎన్ఎస్‌పి డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ కామాను శ్రీనివాసరావు,ఎఇఒ మాధురి, విహెచ్ఎ రామకష్ణ, ఎంపిఇఒ సయ్యద్ జానీ బాషా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె: పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణపై అవగాహన కల్పిస్తూ.. తక్కువ పెట్టుబడితో రైతులు అధిక దిగుబడులు సాధించేలా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎఒ మహేష్ బాబు పేర్కొన్నారు. కారుమూరు, రేపల్లె అర్బన్ గ్రామాల పరిధిలోని రైతు సేవ కేంద్రాల వద్ద పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ వారానికి రెండు రోజులు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులతో క్షేత్ర సందర్శన, చర్చాగోష్టి నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి మంగళ, బుధవారాలు ముందస్తుగా తయారు చేసిన షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాలను సందర్శిస్తారని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు అనుసరించాల్సిన నూతన పద్ధతులను ఆయా శాఖల అధికారులు రైతులకు తెలియజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు కె. సుమంత్, ఐ. నవీన్, గ్రామ వ్యవసాయ సహాయకులు నిఖిల్, వినయ్ కుమార్,, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రేపల్లెలో మాట్లాడుతున్న ఎఒ

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి- భట్టిప్రోలు

మండల పరిధిలోని పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యాకిట్లు మంగళవారం అందజేశారు. టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్ కిట్లను ఎంపీపీ డివి.లలిత కుమారి, జడ్‌పిటిసి తిరివీధుల ఉదయ్ భాస్కరీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఉచిత విద్యతోపాటు విద్యార్థులకు దుస్తులు, బూట్లు టై అందజేస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల ద్వారానే మెరుగైన విద్యా బోధన, ఉత్తమ ఫలితాల సాధన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వింజమూరి పూర్ణ




భట్టిప్రోలులో పుస్తకాలు అందజేస్తున్న ఎంపిపి, జడ్‌పిటిసి

చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాంపట్నం: ప్రభుత్వ పథకాలను విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని నిజాంపట్నం ఎంఇఒ జి. శేషు గోపాల్ తెలిపారు. నిజాంపట్నం ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సర్వేపల్లి రాధాకష్ణన్ కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు ,వర్క్ పుస్తకాలు, బ్యాగు, షూలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ గుడుమోటు రజిని. ప్రధానోపాధ్యాయుడు చుక్కా బాపయ్య, ఉపాధ్యాయులు షేక్ ఆరిఫున్నీసా, ఎం.శ్రీనివాసరావు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

పంగులూరు : విశ్రాంత ఉపాధ్యాయుడు పాలపర్తి కోటయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు పాలపర్తి జయ కుమార్, ప్రసన్న కుమార్ విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను అందజేశారు. పంగులూరులోని మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు ఎంఇఒల నాగభూషణం, గోగుల వీరాంజనేయులు చేతులు మీదుగా మంగళవారం నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత పాలపర్తి ప్రసన్నకుమార్ ,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుర్రం లక్ష్మీప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నిజాంపట్నంలో బుక్స్ అందజేస్తున్న ఎంఇఒ



పంగులూరులో నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎంఇఒ



రహదారి పనులను పరిశీలిస్తున్న అనగాని శివప్రసాద్

రహదారి పనులు పరిశీలన

ప్రజాశక్తి - నిజాంపట్నం

నిజాంపట్నం రహదారి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి సోదరులు అనగాని శివప్రసాద్ తెలిపారు. నిజాంపట్నం మండలం పల్లపట్ల నుంచి సబ్జా వారి పాలెం వరకూ నిర్వహిస్తున్న రహదారి మరమ్మతు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ రహదారి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు రహదారి పూర్తయ్యే విధంగా ఆర్ అండ్ బి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదనారు. ఈ కార్యక్రమంలో కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాన్ని మురళీధర్ రావు, కూచినపూడి మార్కెట్ యార్డు చైర్మన్ ఓగిబోయిన వెంకట్ యాదవ్, గోగినేని శ్రీనివాసరావు, తాత ఏడుకొండలు, రవిశంకర్, ధర్మతేజ, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- సంతమాగులూరు

సంతమాగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏల్చూరు, కొమ్మాలపాడు, మక్కెనవారిపాలెం, గురిజేపల్లి, కొప్పరం, పాత మాగులూరు గ్రామాలలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టులకు ఈనెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి నిర్మల్ కుమార్ తెలిపారు. దరఖాస్తు చేసుకొనే అభ్యర్థులు ఆయా గ్రామాల సచివాలయాల పరిధిలోని వారై ఉండాలన్నారు. దరఖాస్తుల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్ వైజర్‌ను సంప్రదించాలన్నారు.

వృద్ధులకు దుస్తులు అందజేత

ప్రజాశక్తి- అద్దంకి

అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం చెందిన గోరంట్ల వివేక్ ఆస్ట్రేలియాలో ఉద్యోగంలో చేరారు. అందులో భాగంగా వివేక్ తల్లి తండ్రులు గోరంట్ల మస్తాన్ రావు, కళ్యాణి దంపతులు సింగరకొండలోని శ్రీరామ వద్ధాశ్రమంలోని వద్ధులకు నూతన వస్త్రాలు, చీరలు, ధోవతులు మంగళవారం అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుడు రావూరి రంగయ్య దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కిరణ్‌కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి- అద్దంకి

అద్దంకి సబ్ ట్రెజరీ అధికారిగా ఖాదర్ బాధతలు స్వీకరించారు. అందులో భాగంగా ఎపిఎన్‌జిఒ అద్దంకి తాలూకా అధ్యక్షుడు కిరణ్ కుమార్, కార్యదర్శి టి. రమేష్‌బాబు తదితరులు కిరణ్‌కుమార్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ జి. ఏడుకొండలు, సంయుక్త కార్యదర్శి కె.రవికుమార్, స్టేట్ కౌన్సిల్ మెంబరు కె.శ్రీనివాసరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నిజాంపట్నం ఎఒగా విజయరాజు

ప్రజాశక్తి - నిజాంపట్నం

నిజాంపట్నం ఎఒగా చుక్కా విజయరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ యాన నెల్లూరు జిల్లా ఉదయగిరి ఎఒగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలు, ప్రభుత్వ పథకాలు, రాయితీలను రైతుసేవా కేంద్రాలు ద్వారా ప్రతి ఒక్క రైతుకు అందే విధంగా కృషి చేస్తామని తెలిపారు.50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

దేవాదాయ ఆస్తులపై ప్రత్యేక దృష్టి

- ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు
- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేవాదాయ శాఖకు చెందిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వాటి వివరాలను వెబ్ ల్యాండ్ లో అప్‌డేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, అధికారులను ఆదేశించారు. ఒంగోలు కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధ్యక్షతన దేవాదాయ ఆస్తుల పరిరక్షణకు జిల్లా స్థాయి ఇంటర్ డిపార్ట్మెంటల్ కమిటీ సమావేశం జరిగింది. దేవాదాయ శాఖకు సంబంధించిన ఆస్తుల పరిరక్షణకు, డేటాను రెవెన్యూ వెబ్ ల్యాండ్ లో అప్ డేట్ చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేవాదాయ శాఖ అధికారులు అజెండా లో పొందుపరచిన వివిధ దేవాలయాల ఆస్తులను సంబంధిత తహశీల్దార్లు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన చేసి వారి పరిధిలో అవకాశం ఉంటే మ్యుటేషన్ లేదా పేరు మార్పు చేసి వెబ్ ల్యాండ్ లో నమోదు చేయాలన్నారు. తహశీల్దార్ పరిధిలో లేకపోతే సమగ్ర సమాచారంతో ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపాలని కలెక్టర్, తహశీల్దార్లను ఆదేశించారు. దేవాదాయ శాఖకు చెందిన ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కలెక్టర్, రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాల కృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి. చిన ఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్డిఓ లు కె.లక్ష్మీ ప్రసన్న, కె.కేశవర్ధన్ రెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాల రావు, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దారులు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకు కొనుగోలులో ప్రతిష్టంభన

- మూడు గ్రేడ్లుగా పొగాకు కొంటామంటున్న మార్క్‌ఫెడ్
- మార్క్‌ఫెడ్ ఆంక్షల పట్ల రైతుల ఆందోళన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మార్క్‌ఫెడ్ ద్వారా నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేసే విషయంలో సదరు ప్రభుత్వ సంస్థ పెడుతున్న ఆంక్షల పట్ల పొగాకు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నల్లబర్లీని మూడు గ్రేడ్ లుగా కొనుగోలు చేసే ప్లాట్‌ఫారాలకు తేవాలని, నెమ్ము శాతం 20కి మించ కూడదని, 150 కిలోలు ఒక్కొక్క చెక్కుకు కాటా పరిమితి అని, సన్న పట్టలు అయితే చెక్కుకు ఒక కిలో తరుగు, గట్టి పట్టలు అయితే చెక్కుకు రెండు కిలోలు తరుగు తీసివేస్తారని, చవిటి నేలలు అంటే సెలైన్ పొగాకు కొనుగోలు నిషిద్ధమని ఆ పొగాకును ప్లాట్‌ఫారాలకు తీసుకురావద్దన్న నిబంధనలను పెట్టారు. మొదటిసారిగా నల్లబర్లీ పొగాకు కొంటున్న మార్క్‌ఫెడ్ అధికారులు పెడుతున్న నిబంధనల పట్ల రైతులు గుర్రుగా ఉన్నారు. గతంలో రైతులు, అధికారులు, పొగాకు కంపెనీల వారితో జరిగిన సంయుక్త సమావేశాల్లో రైతుకు నష్టం లేకుండా చేయాలన్న ఉద్దేశంతో ఉన్న పొగాకును రెండు గ్రేడులుగా విభజించి మొదటి గ్రేడును రూ 12 వేలు, రెండో గ్రేడు రూ 6 వేలకు పొగాకు కంపెనీల వారు కొనుగోలు చేయాలని నిర్ణయించడం జరిగింది. ఇప్పుడు మార్క్‌ఫెడ్ అధికారులు పెడుతున్న నిబంధనల ఊసేది అప్పుడు రాలేదు. అయితే కంపెనీల వాళ్లు నల్లబర్లీ కొనుగోలు విషయంలో ఇచ్చిన హామీల మేరకు కొంటున్న పరిస్థితి లేదు. దీంతో ప్రభుత్వమే స్వయంగా పొగాకును ప్రభుత్వ సంస్థ అయిన ఏపీ చేత కొనుగోలు చేసి రైతుకు మేలు చేయాలని నిర్ణయించింది. అందుకుగాను రూ 300 కోట్ల భారాన్ని భరించేందుకు రాష్ట్రప్రభుత్వం తాము సిద్ధపడింది. తీరా మంగళవారం నుంచి అధికారికంగా నల్లబర్లీ కొనుగోళ్ళు జరగాల్సి ఉన్న నేపథ్యంలో మార్క్‌ఫెడ్ అధికారులు పెడుతున్న ఆంక్షల పట్ల రైతులు తన నిరసన తెలిపారు.


నిల్వ ఉన్న పొగాకు మండెలను ఆరబెట్టుకుంటున్న రైతులు

పొగాకు మూడు గ్రేడ్‌లుగా కొంటామన్న విషయంలోనే తమకు ఇబ్బందిగా ఉందని, ఇలాంటి ఆంక్షలు పెట్టినందు వల్ల రైతుకు ఒరిగే ప్రయోజనం తక్కువ అని ఈ నిబంధనలను మార్చుకోవాలని రైతులు కోరుతున్నారు. పొగాకు నెమ్ము విషయంలో, ఇతర నిబంధనల విషయంలో తాము ఏకీభవిస్తామని అయితే ఈ గ్రేడింగ్ విషయం మాత్రం తమకు అనుకూలంగా లేదని ఈ పరిస్థితులలో పొగాకును మార్క్‌ఫెడ్‌కు అమ్మడం తమకు నష్టం అని పొగాకు రైతులు పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు దష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. సోమవారం పర్చూరు మార్కెట్ యార్డుకు వచ్చిన వ్యవసాయ శాఖ, మార్క్ ఫెడ్ అధికారులను రైతులు కలిసి ఈ అంశాలను వివరించారు.

తాము పర్చూరు బర్లీ పేరుతో చాలా సంవత్సరాలుగా ఈ పొగాకును పండిస్తున్నామని చిన్న మధ్య తరహా వ్యాపారస్తులకు, కార్పొరేట్ కంపెనీలకు ఈ పొగాకును నిబంధనలు, ఎలాంటి గ్రేడింగ్‌లు లేకుండా అమ్మడం అనేక సంవత్సరాలుగా జరుగుతుందని, తాము ఎప్పుడూ గ్రేడింగులు చేసి పొగాకు అమ్మిన సందర్భాలు లేవని రైతులు చెబుతున్నారు. ఏక మొత్తంగా నల్లబర్లీ కొనేవారని, అయితే గత సంవత్సరం పొగాకు రైతులకు మంచి లాభాలు ఈ పంట ద్వారా వచ్చిన నేపథ్యంలో ఈ సంవత్సరం అత్యధికంగా రైతులు నల్లబర్లీ పొగాకును అధికంగా పండించడం జరిగిందని చెబుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న కంపెనీలు, వ్యాపారస్తులు సిండికేట్ అయి, పొగాకు పంటను మందకొడిగా కొనుగోలు చేయడంలో రైతుల వద్ద పొగాకు నిల్వలు ఉండిపోయాయని, పంటను వేయమని చెప్పిన కంపెనీల వారే ఇప్పుడు కొనేందుకు ముందుకు రాలేదని రైతులు పేర్కొంటున్నారు.

ఈ నేపథ్యంలో మార్క్ ఫెడ్ అధికారులు కూడా పొగాకు గ్రేడింగ్ పేరిట ఆంక్షలు విధించడంతో రైతులు తీవ్ర నిరాశకు గురై తాము పొగాకును ఈ నిబంధనలతో అమ్మడానికి సిద్ధంగా లేవని ఖరాకండిగా చెప్పడం జరిగింది. దీంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పై అధికారులు, మంత్రులతో మాట్లాడి ఈ సమస్యకు పరిష్కారం దొరికాక నల్లబర్లీ కొనుగోళ్ళు జరపవచ్చని భావించి పొగాకు కొనుగోళ్ళను వాయిదా వేసినట్లు తెలిసింది.

కాగా రానున్న వర్షాకాలంలో పొగాకు నిల్వ ఉంచడం చాలా కష్టమని, దీనిని గ్రేడింగ్ చేసే సమయంలో అధిక ఖర్చు తో పాటు, వర్షాల వల్ల పొగాకును సగానికి సగం నష్టపోయే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఈ ఆంక్షలతో పొగాకును అమ్ముకోదలిచినట్లయితే తాము రెండు నెలల క్రితమే నష్టాలతోనే బయట వ్యాపారస్తులకు అమ్ముకునే వాళ్ళమని, తమకు ప్రభుత్వం అండగా ఉంటుందని భావించి వేచి చూస్తున్నామని నల్లబర్లీ రైతులు పేర్కొంటున్నారు. త్వరితంగా నల్లబర్లీ కొనుగోళ్ళు జరపాలని రైతులు కోరుతున్నారు.

వైద్య, ఆరోగ్య శాఖలో

బదిలీ కౌన్సెలింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో బదిలీ కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. ప్రభుత్వ నిబంధనలు, వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖలోని 8 వివిధ క్యాడర్లకు సంబంధించి 80 మందికి జూమ్ ద్వారా బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో ల్యాబ్ టెక్నీషియన్లు 12 మంది, టైపిస్టులు ముగ్గురు, జూనియర్ సహాయకులు ఐదుగురు, ఆఫీస్ సబార్డినేట్స్ 31 మంది, డ్రైవర్లు 11 మంది, ఎంఎన్ఒ ఒకరు, ఎఫ్ఎన్ఒ నలుగురు, స్వీపర్స్ నలుగురు ఉన్నారు. ఆయా క్యాడర్‌ల్లో పనిచేస్తున్న వారు బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరై ప్రాధాన్యత ప్రకారం కోరుకున్న స్థానాలకు బదిలీ అయ్యారు. బదిలీ కౌన్సెలింగ్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి గీతాంజలి, కార్యాలయ సూపరింటెండెంట్ రాజేష్, డేటా మేనేజర్ సిహెచ్ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.


పర్యవేక్షిస్తున్న డిఎంహెచ్ఒ

పాఠశాలలను యోగశాలలుగా మార్చాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో అన్ని పాఠశాలలను యోగశాలలుగా మార్చాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంగళవారం అమరావతి సచివాలయం నుండి పాఠశాల విద్యశాఖ డైరెక్టర్ జిల్లా కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది, పదవ తరగతి, ఐటిఐ, ఇంటర్మీడియట్, డిగ్రీ అపై విద్యార్థులు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేటట్లు చూడాలన్నారు. జూన్ 21న అన్ని విద్యాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి సంబంధించి ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని సచివాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమలు నిర్వహించాలని చెప్పారు. ఈ నెల 17, 18, 19 తేదీలలో విద్యార్థులకు యోగాపై ట్రైనింగ్ ఇవ్వాలన్నారు. ట్రైనింగ్ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్ మంజూరు చేయాలన్నారు. తల్లికి వందనం అందని కుటుంబాలకు టెక్నికల్ సమస్యలు ఎదురైతే క్లియర్ చేసే విధంగా అధికారులు సూచనలు చేయాలని ఆయన చెప్పారు. బాపట్ల జిల్లా నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి,డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

'సెల్ఫ్ హెల్ప్' గ్రూప్‌ల లక్ష్యాలను పూర్తి చేయాలి

డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి నారాయణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

లక్ష మంది మహిళలను మహిళా పారిశ్రామికవేత్తలుగా తయారుచేసే లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి నారాయణ పేర్కొన్నారు. మంగళవారం నాడు జిల్లా లోని 38 మండలాలకు చెందిన వెలుగు టిటిడిసిలో డిపిఎం, ఏపిఎం, సిసిలతో సమీక్షాసమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన కార్యక్రమలాలో భాగంగా మహిళల అభ్యున్నతికై వారి జీవనోపాధుల మెరుగు కోసం ఈ ఏడాది మొత్తం 45,257 గ్రూపులకు గానూ ఇప్పటివరకు 18,685 గ్రూపులు మాత్రమే వివరాలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసారని, ఇంకనూ 26572 గ్రూపులకు అప్‌డేట్ చేయవలసి ఉందన్నారు. ఆ వివరాలు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎల్‌డిఎం రమేష్, లైవ్ లీవుడ్ డిపిఎం డి.దానం, అంబేద్కర్ లక్ష్మీరెడ్డి, రజనీకాంత్, కృపారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా మొబైల్ లో

'శక్తి' యాప్‌ను నిక్షిప్తం చేసుకోవాలి..

ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

'శక్తి యాప్' మహిళలకు రక్షణ కవచంలాంటిదని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లాలోని ప్రతి ఒక్క మహిళ మొబైల్‌లో నిక్షిప్తం చెయ్యాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని శక్తి బందాలు విస్తతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. మంగళవారం శక్తి బందాలు జిల్లాలోని రైల్వే స్టేషన్ లు, బస్టాండ్ లు, ఇతర రద్దీ ప్రదేశాలు, షాపింగ్ మాల్స్, అంగన్వాడీ కేంద్రాలు వంటి ప్రదేశాలలో "శక్తి యాప్" వినియోగించు విధానం, అందులో పొందుపరచబడిన సమాచారం తదితర వివరాల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఏదైన అనుకోని ఆపద వచ్చినప్పుడు పోలీస్‌ల తక్షణ రక్షణ పొందడానికి "శక్తి యాప్" ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని ప్రతి ఒక్క మహిళా వారి మొబైల్ ఫోన్‌లలో శక్తి యాప్ నిక్షిప్తం చేసుకోవాలని సూచించారు. పోలీస్ సేవలను మహిళలకు మరింత చేరువ చేసేందుకు శక్తి వాట్సాప్ నెంబర్ 7993485111ను కూడా అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు శక్తి వాట్సప్ నెంబరుకు వీడియో కాల్ లేదా నార్మల్ కాల్, మేసేజ్ చేసినా సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్ కు సంకేతాలు వెళతాయన్నారు.

ఎగవేతదారుల నుంచి

పన్ను వసూలుకు చర్యలు

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వాణిజ్య పన్నులు ఎగవేతదారుల నుంచి పన్ను వసూలుకు అధికారులు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. వాణిజ్య పన్నులు, అనుబంధశాఖల అధికారులతో జిల్లాస్థాయి సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. చట్టబద్ధంగా వాణిజ్య పన్ను వసూలుపై యంత్రాంగం దష్టి పెట్టాలని కలెక్టర్ చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.95.14 కోట్లు వాణిజ్య పన్ను వసూలు జరిగిందన్నారు. ప్రస్తుతం గణనీయంగా పన్ను వసూలు తగ్గడంపై ఆరా తీశారు. బాపట్ల జిల్లాలో అత్యధికంగా కాటన్ మిల్లులు, గ్రానైట్ పరిశ్రమ, ఆయిల్ మిల్లులు, ఆక్వా రంగానికి సంబంధించిన పరిశ్రమలపైనే వాణిజ్య పన్నులు అత్యధికంగా వసూలు అవుతున్నాయన్నారు. రూ.50 లక్షలు టర్నోవర్ దాటిన వారంతా కచ్చితంగా జిఎస్టి చెల్లించాలన్నారు. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కరెంట్ అకౌంట్లకు సంబంధించిన బ్యాంకు ఖాతాల వివరాలను వాణిజ్య శాఖకు అందించాలన్నారు. తద్వారా వాణిజ్య పన్నులు వసూలుకు మార్గం సుగమమవుతుందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు, విద్యా సంస్థలు, గ్రామపంచాయతీలు, జిల్లా పరిషత్ జిఎస్టి చెల్లిస్తేనే పునరుద్ధరణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కొనుగోలు చేసే ప్రతి అంశంలోను ఏపీ జీఎస్టీని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా వివిధ నిర్మాణ రంగాల్లో అభివద్ధి పనులు చేపట్టే గుత్తేదారులు బిల్లులు చేసినప్పుడే పన్ను చెల్లించేలా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రానైట్ పరిశ్రమ నుంచి పన్నుల రూపంలో ప్రభుత్వానికి నష్టం జరుగుతోందని కలెక్టర్ చెప్పారు. గ్రానైట్ క్వారీలు, పరిశ్రమలు, రవాణాలో బోగస్ రిజిస్ట్రేషన్ల ద్వారా పన్నులు వసూలు కావడం లేదని తాజా సర్వేలో వెలుగులోకి వచ్చిందన్నారు. పన్నుల ఎగవేతను అరికట్టడానికి ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. అధికారుల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా అక్రమాలను పూర్తి స్థాయిలో అరికడతామని తెలిపారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా జరిగే భూముల క్రయవిక్రయాలపై స్పష్టమైన వివరాలను నిక్కచ్చిగా వాణిజ్య శాఖకు అనుసంధానించాలన్నారు. తీర ప్రాంతాల్లోని రిసార్ట్స్ నిర్వహణ, ఆర్థిక లావాదేవీలపై పర్యాటకశాఖ, వాణిజ్య పనుల శాఖ సమన్వయంతో పనిచేయాలన్నారు. జీఎస్టీ చెల్లించకుండా గుత్తేదారులు పనిచేస్తున్నట్లు నిర్ధరణ అయితే వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో వాణిజ్య పన్నులశాఖ సంయుక్త కమిషనర్ బి గీతామాధురి, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా వాణిజ్య పనుల శాఖ అధికారి ఆర్ శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.